సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ၊ 5 ၊ అక్టోబర్ ၊ 2024



డీఎస్పీల బదిలీ
రాష్ట్రంలోని 12 మంది డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. పుట్టపర్తి డీఎస్పీగా విజయ్‌కుమార్‌ను నియమించింది. దిశ డీఎస్పీ శ్రీనివాసులును బదిలీ చేసింది.



కిలో టమాట రూ.63
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.63, కనిష్టంగా రూ.42 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.2°/22.5°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కూర్మావతార అలంకరణలో ఖాద్రీశుడు



కదిరి టౌన్: దసరా శరన్నవరాత్రి వేడుకలు జిల్లా వ్యాప్తంగా కనుల పండువగా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి ఇష్టమైన రోజుకావడంతో ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. రెండోరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కదిరి కొండపై వెలసిన ఖాద్రీ లక్ష్మీనారసింహుడు శుక్రవారం రాత్రి కూర్మావతార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకున్నారు.

'కరువు' నివేదిక త్వరగా రూపొందించండి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం




సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్

ప్రశాంతి నిలయం: తీవ్ర వర్షాభావంతో కరువు బారిన పడిన మండలాల సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరువు పరిస్థితులపై ఆరా తీశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ చేతన్... జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. మండలాల వారీగా వర్షపాతం... సాగు విస్తీర్ణం, ఎండిన పంటల విస్తీర్ణం, దెబ్బతిన్న పంటలు తదితర వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు, సీపీఓ విజయ కుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, భూగర్భజల అధికారి మల్లికార్జున రావు, హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సుపాసుల జారీ నిలిపివేత
పుట్టపర్తి టౌన్: సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ నేపథ్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు బస్సు పాసుల జారీని నిలిపివేయనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 7వ తేదీ నుంచి యథావిధిగా బస్సుపాసులు జారీ చేస్తామన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.



- సుప్రీం తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు
- నెయ్యి వివాదంలో కేంద్ర సిట్ నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ రద్దు నిర్ణయం సరైనదే
- 'సీబీఐ డైరెక్షన్'లో స్వతంత్ర సంస్థ దర్యాప్తుపై ప్రముఖుల హర్షం
- టీటీడీ పవిత్రతకు భంగం కలిగించిన ప్రభుత్వంపై ప్రజల మండిపాటు



దేవుడితో... రాజకీయం వద్దు

తిరుమల లడ్డూ వివాదంలో సుప్రీం కోర్టు సీఎం చంద్రబాబుకు మొట్టికాయలు వేసింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దంటూ హితవు పలికింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థకు దర్యాప్తు అప్పగించింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సాక్షి, పుట్టపర్తి

తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు.. తిరుమల లడ్డూ వివాదాన్ని రేపి దేవుళ్లతో రాజకీయాలు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది శ్రీవారి భక్తులకు అత్యంత ఆందోళన కల్గించిన తిరుమల లడ్డూ వివాదంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని సుప్రీం కోర్టు ఆదేశించడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అని అభివర్ణిస్తున్నారు. 'సిట్' ఏర్పాటుతో తాను చేసిన 'కల్తీ లడ్డు' ప్రకటనకు మద్దతుగా నివేదిక ఇప్పించాలని చూసిన చంద్రబాబుకు ఆ దేవదేవుడే సుప్రీం కోర్టు రూపంలో సరైన నిర్ణయం తీసుకున్నాడంటున్నారు. పవిత్రంగా భావించే 'తిరుమల లడ్డూ' తయారీలో జంతువుల కొవ్వు వాడారంటూ బాధ్యతాయుతమైన సీఎం పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడిన మాటలకు ఎలాంటి ఆధారాలూ లేవని సుప్రీం కోర్టు ఘాటు వ్యాఖ్యలు చేయడం సబబేనంటున్నారు. రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు టీటీడీ పవిత్రతను మంటగలిపే ప్రయత్నం చేశారని, స్వతంత్ర సంస్థ 'లడ్డూ వ్యవహారం'పై దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

చంద్రబాబుకు చెంపపెట్టు



తిరుమల లడ్డూ వివాదంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌ను రద్దు చేసి సీబీఐ పర్యవేక్షణలో స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం చంద్రబాబుకు చెంపపెట్టు లాంటిది. సీబీఐ నేతృత్వంలో స్వతంత్ర సంస్థ దర్యాప్తుపై భక్తులకు, ప్రజలకు విశ్వసనీయత ఉంటుంది. అధికారులు విచారణను నిష్పక్షపాతంగా జరిపి నిజానిజాలను నిగ్గు తేల్చాలి.
– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ధర్మవరం

న్యాయమే గెలిచింది



తిరుమల లడ్డును వివాదాస్పదం చేసిన రాజకీయ నాయకులకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడంతో న్యాయమే గెలిచింది. స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేపిస్తేనే నిజాలు బయటికి వస్తాయి. దర్యాప్తు ఎలా ఉన్నా హిందువుల మనోభావాలను దెబ్బతీయడం నాయకులు మానుకోవాలి. – అనంత పద్మనాభ శర్మ, బ్రాహ్మణ సంఘం ప్రతినిధి

కుట్రలు బయటపడతాయి



తిరుమలను స్వార్థ రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గం. శ్రీవారి లడ్డూ ప్రసాదం గురించి చంద్రబాబు సీఎం హోదాలో నిరాధార ఆరోపణలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని స్వతంత్ర సంస్థతో దర్యాప్తునకు ఆదేశించడం శుభ పరిణామం. దీంతో రాజకీయ కుట్రలు బయటపడతాయి. చంద్రబాబు వంద రోజుల పాలనలో ప్రజలకు, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు 'లడ్డూ' వివాదాన్ని తెరపైకి తెచ్చారు. త్వరలోనే నిజానిజాలు తెలుస్తాయి. అప్పుడు అసత్య ప్రచారాలతో భక్తులను తప్పుదోవ పట్టించిన వారికి కఠిన శిక్ష విధించాలి. – టీఎస్ దీపిక, వైఎస్సార్ సీపీ హిందూపురం సమన్వయకర్త

బాబు బండారం బయటపడుతుంది



తిరుమల లడ్డూ వ్యవహారంపై చంద్రబాబు చేసిన నిరాధార ఆరోపణలు ఎందరినో కలచివేశాయి. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో స్వతంత్ర సంస్థ సమగ్ర విచారణ జరిపితే బాబు బండారం బయటపడుతుంది. కోర్టు ఆదేశాలను మేము స్వాగతిస్తున్నాం. చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. దేవుడిని రాజకీయాల్లోకి తెచ్చి పాపం అంటగట్టుకున్నారు. అందుకు తగిన మూల్యం తప్పక చెల్లించుకుంటారు.
– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

ఆలోచించి మాట్లాడాలి



రాజకీయ పదవుల్లో ఉన్న వారు భగవంతుడి గురించి మాట్లాడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం సరికాదు. జూలైలో రిపోర్టు వస్తే.. సెప్టెంబరులో ఎందుకు మాట్లాడాలి? సున్నితమైన అంశాలపై లేనిపోని రాద్ధాంతం చేస్తూ మాట్లాడితే కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తింటాయి. – లింగాల లోకేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్, కదిరి

సుప్రీంకోర్టుది మంచి నిర్ణయం



రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు లేకుండా తిరుమల లడ్డూపై రాద్ధాంతం చేయడం బాధ్యతారాహిత్యం. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్‌తో ఎలాంటి ఉపయోగం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ నిజానిజాలు వెలికితీసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. పని చేసే పరిస్థితి ఉండదు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం మంచిదే. రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యలు మానుకోవాలి. – వేమనారాయణ, పుట్టపర్తి

సుప్రీం ఆదేశాలను స్వాగతిస్తున్నాం



స్వతంత్ర సంస్థతో విచారణ జరిపిస్తే తిరుమల లడ్డూ తయారీలో ఏ రకం నెయ్యి వాడారో తెలుతుంది. టీటీడీ ప్రాభవాన్ని తగ్గిస్తూ లడ్డూ కల్తీ జరిగిందటూ సీఎం చంద్రబాబు మాట్లాడటంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు లాంటిది. ఇకనైనా చంద్రబాబు మాట తీరు మారాలి. తిరుమల లడ్డూను అపవిత్రం చేసి మాట్లాడటం మానాలి. – ధనరాజ్, సినీదర్శకుడు, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

సీఎం హోదాలో సరికాదు



ఓ ముఖ్యమంత్రి స్థాయిలో నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. టీటీడీ బోర్డు, ప్రతిపక్ష నేత, గత ప్రభుత్వంపైన కానీ ఆరోపణలు చేసే ముందు ఆలోచించాలి. తిరుపతి అనేది సెంటిమెంటల్ వ్యవహారం. తొందరపాటు నిర్ణయాలు సరికాదు. కోర్టు డైరెక్షన్ మేరకు చంద్రబాబు ఇప్పటికైనా సక్రమమైన మార్గంలో నడవాలి. లడ్డూపై అనవసర వివాదాలు చేయడం సరికాదు. – విజయ్ గోపాల్, పురోహితుడు, అగ్రహారం, బుక్కపట్నం మండలం

టీడీపీ నేతల ఇసుక దోపిడీ!





యర్రవంకలవారిపల్లి సమీపంలో పీఎల్ఆర్ కంపెనీ నిల్వ ఉంచిన ఇసుక, ఇసుకను అక్రమంగా తీసుకువెళ్లేందుకు టీడీపీ నేతలు తెచ్చిన టిప్పర్లు

- డంప్ నుంచి అక్రమంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నం
- అడ్డుకున్న యర్రవంకలవారిపల్లి గ్రామస్తులు

ఎన్పీకుంట: ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన డంప్ నుంచి ఇసుకను అక్రమంగా తీసుకెళ్లేందుకు టీడీపీ నేతలు సిద్ధం కాగా, ప్రజలు అడ్డుకున్నారు. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని యర్రవంకలవారిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుడు తిరుమల నాయుడు తెలిపిన వివరాల మేరకు.. 2022 సంవత్సరంలో హంద్రీ నీవా కాలువ పనుల్లో భాగంగా మరికొమ్మదిన్నె పంచాయతీలో పైప్‌లైన్ పనులను పీఎల్ఆర్ కంపెనీ చేపట్టింది. పైపుల తయారీ కోసం అప్పట్లో ప్రభుత్వ అనుమతితో వేంపల్లి గండి ఇసుక రీచ్ నుంచి ఇసుకను తీసుకువచ్చి యర్రవంకలవారిపల్లి గ్రామ సమీపంలో డంప్ ఏర్పాటు చేసింది. అయితే అనివార్య కారణాలతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ ఇసుకపై కన్నేసిన తలుపుల మండలానికి చెందిన టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, భార్గవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సుమారు ఆరు టిప్పర్లతో ఇసుకను తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని గ్రామస్తులంతా ఏకమై అడ్డుకున్నారు. పీఎల్ఆర్ కంపెనీ ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసుకున్న డంప్ నుంచి ఇసుక ఎలా తీసుకెళ్తారంటూ ప్రశ్నించారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగ్గా.. సామాజిక మాధ్యమాల్లో ఈ ఘటన వైరల్ అయ్యింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. ప్రభుత్వ అనుమతితోనే పీఎల్ఆర్ కంపెనీ ఇసుక డంప్ ఏర్పాటు చేసినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు కూడా టీడీపీ నేతలను తప్పుపట్టారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం
- మంత్రి సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న మంత్రి సవిత

పుట్టపర్తి టౌన్: జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుదామని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత, కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయి ఆరామంలో 'స్వర్ణాంధ్ర–2047 విజన్ ప్లాన్' జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి సవిత, పుట్టపర్తి, కదిరి ఎమ్మెల్యేలు సింధూరారెడ్డి, కందికుంట ప్రసాద్, కలెక్టర్ టీఎస్ చేతన్, సీపీఓ విజయకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాబోవు ఐదేళ్లల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దేశానికే ఆదర్శంగా నిలపాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని, ఆయన ఆలోచనలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం నియోజక వర్గాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యానం, పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందని, అభివృద్ధికి కావలసిన అన్ని వనరులూ ఉన్నాయన్నారు. అనంతరం పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కీలక రంగాలపై దృష్టి సారించండి..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో విజన్ 2047ను తీసుకువచ్చారని కలెక్టర్ చేతన్ అన్నారు. అధికారులు జిల్లాలో కీలక రంగాలపై దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. జిల్లా విజన్ ప్రణాళికలో ప్రజలు, విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ, అనుబంధ రంగాలు, పరిశ్రమల శాఖ అధికారులు తమ శాఖల ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుకు చంద్రబాబు శఠగోపం

- 'అన్నదాత సుఖీభవ'పై నేటికీ నోరు తెరవని వైనం
- నేడు అన్నదాతల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు
- కూటమి సర్కార్‌పై దుమ్మెత్తిపోస్తున్న రైతులు



పుట్టపర్తి అర్బన్: అధికారంలోకి రాగానే రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామని చెప్పిన చంద్రబాబు పగ్గాలు చేపట్టి నాలుగు నెలలైనా రైతుల గురించి నోరు మెదపడం లేదు. మరోవైపు పీఎం కిసాన్ నిధులు శనివారం కేంద్రం రైతుల ఖాతాల్లో జమ చేయనుండగా, చంద్రబాబు ఎప్పటిలాగే శఠగోపం పెట్టారని రైతులు చర్చించుకుంటున్నారు.

జగన్ హయాంలో రూ.1767.09 కోట్లు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి మాసాల్లో 'రైతు భరోసా' సొమ్ము రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి. దీంతో పెట్టుబడులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. రైతు భరోసా కింద ఐదేళ్లలో జిల్లా రైతులకు సుమారు రూ.1767.09 కోట్లు ఆర్థిక సహాయం అందింది. తాజాగా కేంద్రం పీఎం కిసాన్ కింద ఈ ఏడాది రెండో విడత (మొత్తంగా 18వ విడత) రూ.2 వేల ఆర్థిక సాయం శనివారం ఖాతాల్లో జమ చేయనుండగా, అన్నదాత సుఖీభవ మొత్తం రూ.20 వేలు ఏమైందంటూ జిల్లాలోని 3.65 లక్షల మంది రైతులు ఆరా తీస్తున్నారు. కానీ సమాధానం చెప్పేవారే కరువయ్యారు.

2,54,688 మందికి పీఎం కిసాన్..

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం పేరుతో రైతులకు ఏటా మూడు విడతల్లో రూ.6 వేలు జమ చేస్తోంది. ఈ ఏడాది రెండో విడతగా ఈనెల 5వ తేదీ శనివారం నిధులు విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని అర్హులైన 2,54,688 మంది రైతుల ఖాతాల్లో రూ.50.94 కోట్లు జమ కానున్నాయి. జూన్ 18వ తేదీన మొదటి విడత కింద 2.51 లక్షల మంది రైతులకు రూ.50.29 కోట్లు జమ చేశారు. రెండో విడతగా నేడు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తోంది. ఇలా కేంద్రం కరుణించినా... రాష్ట్ర ప్రభుత్వం కరుణించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందా.. లేక పీఎం కిసాన్ కింద కేంద్రం జమ చేసే రూ.6 వేలు తీసేసి రూ.14 వేలు ఇస్తుందా..అసలు అన్నదాత సుఖీభవ ఉందా..లేదా అన్నది ఎవరికీ అంతు బట్టడం లేదు.

మోసగించడం ఆయనకు అలవాటే



రైతులను మోసగించడం చంద్రబాబుకు అలవాటే. ప్రతి ఎన్నికల సీజన్‌లోనూ హామీలు ఇవ్వడం, గోడలమీద రాయడం, ప్రమాణాలు చేయడం... అధికారంలోకి వచ్చాక మోసగించడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. రైతులకు ఇచ్చే ఆర్థిక సాయంపై కనీసం ప్రకటన కూడా చేయకపోవడం దుర్మార్గం. రాబోవు రోజుల్లో రైతులే కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తారు. – రాజశేఖర్, బీడుపల్లి

ఆయనొస్తే వ్యవసాయం దండగే



చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ వ్యవసాయం దండుగలా మారుతోంది. రైతు లంటే ఆయనకు మొదటి నుంచీ చులకనే. బాబు అధికారంలో ఉంటే ప్రకృతి కూడా సహకరించదు. అయితే అతివృష్టి లేదా అనావృష్టితో పంటలు దక్కకుండా పోవడం మామూలే. తన పాలనలో రైతులకు ఇచ్చిన హామీలు చంద్రబాబు ఒక్కటీ అమలు చేయరు. ఈ ఐదేళ్లూ రైతులకు శఠగోపమే. – వెంకటరామిరెడ్డి, రైతు, కొట్లపల్లి

మాకు సమాచారం లేదు



'అన్నదాత సుఖీభవ' పథకం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జాబితా అడగలేదు. రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేశాం. వాటి నివేదికలను ప్రభుత్వానికి పంపాం. జిల్లాలోని 2,54,688 మంది రైతుల ఖాతాల్లో రూ.50.94 కోట్లు శనివారం జమ అవుతాయి.
– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

రామగిరిలో 'తమ్ముళ్ల' దాష్టీకం

- మైనార్టీ నేత అల్లాబకాష్‌ను టార్గెట్ చేసిన పచ్చనేతలు
- రెండెకరాల్లో సాగు చేసిన చీనీ, మిరప పంటలు దున్నేసిన వైనం
- ఎన్నికల అనంతరం రెండోసారి ఆస్తుల ధ్వంసం
- ఫిర్యాదు తీసుకోని రామగిరి పోలీసులు



అల్లాబకాష్ సాగుచేసిన చీనీ, మిరపపంటలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన రోజు నుంచీ టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారింది. పచ్చ కండువా కప్పుకుంటే సరే.. లేకుంటే పరిటాల తడాఖా ఏంటో చూపిస్తామంటూ టీడీపీ నాయకులు గ్రామాల్లో అలజడులను సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే రామగిరి మండలంలోని ఓ మైనార్టీ నాయకుడిని టీడీపీ నేతలు టార్గెట్ చేశారు. ఆస్తుల ధ్వంసానికి తెగబడ్డారు.

ఎన్నికల అనంతరం ఇది రెండోసారి

రామగిరి మండలం మాదాపురం గ్రామానికి చెందిన అల్లాబకాష్ రాప్తాడు నియోజకవర్గ దూదేకుల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. దీంతో కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు అల్లాబకాష్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ క్రమంలోనే గతజూన్ నెలలో ఆయన ఇంటిపై రాళ్లదాడికి దిగి భయాందోళనలు కలిగించారు. తాజాగా గురువారం రాత్రి అల్లాబకాష్ ఐదు ఎకరాల్లో సాగుచేస్తున్న 180 చీనీ చెట్లతో పాటు, మిరప పంటను మొత్తం దున్నేశారు. చివరకు పీవీసీ పైపులతోపాటు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు రామగిరి స్టేషన్‌కు వెళ్లగా.. పోలీసులు కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదు. దిక్కుతోచని స్థితిలో అల్లాబకాష్ స్వగ్రామం వదిలి అనంతపురం చేరుకున్నాడు. తాను రూ.లక్షలు అప్పుచేసి పంటలు సాగుచేశానని, ఇప్పుడు టీడీపీ నాయకులు మొత్తం నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలిచాక ప్రజలకు మంచి చేయాలేగానీ ఇలా దాడులు, దౌర్జన్యాలు పాల్పడమేమిటని అతను ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా గ్రామాల్లో అలజడులను సృష్టించకుండా నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నారు.


అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాప్తాడు: అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, ఇతని నుంచీ రూ.3.20 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా నగిరిగిరి గ్రామానికి చెందిన గంగన్న అలియాస్ శివ లేపాక్షిలోని పిలిగుండ్ల కాలనీలో నివాసముంటూ శరీర నొప్పులకు సంబంధించిన నూనెల వ్యాపారం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితుడితో కలసి గ్రామాల్లో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ వృద్ధులు ఒంటరిగా ఉంటున్న ఇళ్లను ఎంపిక చేసుకుని వారికి కేరళ వైద్యం ఫ్రీగా చేస్తామని నమ్మించి బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లేవాడు. గత నెల 30న అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధుడు శివరామనాయుడుకి కేరళ వైద్యంతో నయం చేస్తామంటూ ఆయన భార్య రామలక్ష్మిని నమ్మించారు. ఇందుకు సంబంధించి ఆమె ఫొటోను కేరళలోని కంపెనీకి పంపాల్సి ఉంటుందని పేర్కొంటూ శరీరంపై బంగారు నగలు ఉంటే ఉచిత వైద్యం వర్తించదన్నారు. దీంతో ఆమె తన మెడలో ఉన్న 52.7 గ్రాముల బరువున్న బంగారు మాంగళ్యం చైన్, చెవి కమ్మలు తీసి పక్కన పెట్టింది. అదే సమయంలో తాగేందుకు మంచినీళ్లు అడగడంతో ఆమె లోపలకు వెళ్లగానే ఆ నగలు తీసుకుని ఉడాయించారు. గత ఏడాది డిసెంబర్ 28న మడకశిర మండలం అక్కంపల్లిలో నివాసముంటున్న వృద్ధురాలు హనుమక్కనూ మోసగించి ఆమె మెడలోని నగలు తీసి పక్కన పెట్టగానే మంచినీరు కావాలని దృష్టిని ఏమార్చి 12 గ్రాముల బంగారు చైన్‌ను అపహరించారు. కేసు దర్యాప్తు చేపట్టిన ఇటుకలపల్లి పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం ఉదయం ఉప్పరపల్లి పంగల్ రోడ్డు వద్ద తచ్చాడుతున్న గంగన్నను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 62.7 గ్రాముల బరువున్న బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

మద్యం దుకాణాలన్నీ అస్మదీయులకే!

- మద్యం షాపుల టెండర్లలో 'తమ్ముళ్ల' సిండికేట్
- టెండర్లు ఎక్కువ పడకుండా కుట్ర



హిందూపురంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్

హిందూపురం అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇసుక, గ్రానైట్ ఇతర సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్న టీడీపీ నేతలు ఇప్పుడు మద్యం దుకాణాలపై కన్నేశారు. టీడీపీ నేతలకు తప్ప ఇతరులెవ్వరికీ దుకాణాలు దక్కకూడదన్న పక్కా ప్లాన్‌తో సిండికేట్‌గా మారారు. తాము అధికారంలో ఉన్నాం కాబట్టి మద్యం దుకాణాలన్నీ తమ వాళ్లకే దక్కాలనే ధోరణి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే టెండర్లు ఎక్కువగా పడకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు.

సిండికేట్లదే హవా...

హిందూపురం అర్బన్ పరిధిలో టీడీపీకి చెందిన కొందరు 6 మద్యం దుకాణాలకు, రూరల్ పరిధిలో పాటు లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఏర్పాటయ్యే ఒక్కో దుకాణాన్ని దక్కించుకునేలా ప్పటికే సిండికేట్‌గా ఏర్పడ్డారు. బుధవారం రాత్రి ఓ చోట సమావేశమైన నాయకులు టెండర్లు ఇతరులు వేయకుండా అడ్డుకోవాలని, ఒకవేళ వేసినా ఆ తర్వాత వారు దుకాణాలు ప్రారంభించకుండా అడ్డుకోవడంపై చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలోనే ఏఏ దుకాణానికి ఎన్ని టెండర్లు వేసారనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందేలా ఎమ్మెల్యే బాలయ్య పీఏ అధికారులపై ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఓ మెట్టు పైనే ఉంటూ నేరుగా రంగంలోకి దిగారు. తన ఇంటి వద్ద నుంచే చక్రం తిప్పుతున్నారు. ఎవరు షాపులు దక్కించుకున్నా తన వాటా తనకివ్వాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. ధర్మవరంలో జనసేన పార్టీకి చెందిన చిలకం మధుసూదనరెడ్డి హవా నడుస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల్లో టెండర్లు ఎవరు వేయాలన్న దానిపై ఇప్పటికే ఆయన ప్రణాళిక రచించి, ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. పెనుకొండలో మంత్రి సవిత అనుచరుడు శ్రీనివాసులు చెప్పిన వారికే షాపులు దక్కేలా ప్లాన్ చేశారు. ఎవరు షాపులు తీసుకొన్నా పర్సంటేజీ మాత్రం మంత్రికి ఇవ్వాల్సిందేనని అంటున్నారు.ఈ క్రమంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే 20 శాతం ఎక్కువకు విక్రయించి అయినా తమ వాటా తమకు ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు.

కూటమిలో తలెత్తుతున్న విభేదాలు..

తాము చెప్పిన వారే టెండర్లు వేయాలని, దుకాణాలు, బెల్టు షాపుల్లో వచ్చే ఆదాయంలో తమకూ వాటా ఇవ్వాలని ఇప్పటికే టీడీపీ నేతలు హుకుం జారీ చేయడం కూటమిలోని మిగిలిన పార్టీల నాయకులకు నచ్చలేదు. ఊర్లకు ఊర్లు టీడీపీ వారు పంచుకుంటుంటే తామేమీ తక్కువ కాదని బీజేపీ, జనసేన నాయకులు అంటున్నారు. దీంతో పలు నియోజకవర్గాల్లో తమకు అనుకూలమైన వారితో టెండర్లు దాఖలు చేయించేందుకు సిద్ధమయ్యారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓ షాపు తమకు ఇవ్వాల్సిందేనంటూ ఇప్పటికే బేరసారాలు మొదలు పెట్టారు. లేదంటే తామూ టెండర్లలో పాల్గొంటామనే సంకేతాలు ఇస్తున్నారు.

అంతా ఎమ్మెల్యేలు.. షాడోల చేతుల్లోనే

జిల్లా వ్యాప్తంగా 87 దుకాణాలు ఏర్పాటు కానుండగా ఎక్కడ చూసినా ఎన్ని టెండర్లు వేశారు. ఏ షాపులో ఎక్కువ వ్యాపారం జరుగుతుంది. బెల్ట్ షాపులు ఎక్కడ ఏర్పాటు చేయాలి అనేదానిపై చర్చ జరుగుతోంది. హిందూపురంలో తమ అనుమతి లేనిదే మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేయరాదని, ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. హిందూపురంలో 6 దుకాణాలను ఎవరు దక్కించుకున్నా ఆ ముగ్గిరికి 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. మడకశిర నియోజకవర్గంలో ఎవరికి దుకాణం దక్కినా 25 శాతం వాటా అక్కడి ముఖ్య నాయకుడికి ఇవ్వాలని ముందుగానే హెచ్చరిస్తున్నారు. మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన తర్వాత గ్రామాల వారీగా బెల్టు షాపులు ఎవరికివ్వాలో కూడా ముందుగానే నిర్ణయించినట్లు సమాచారం. బెల్టుషాపులు వస్తే తమకూ కొంత లాభంగానే ఉంటుందనే ఆలోచనలో సివిల్, ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

సొంత సంపద సృష్టికే బాబు ఎత్తుగడ

- మూడు లక్షల మందికి ఉపాధి లేకుండా చేశారు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సంపద సృష్టించి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తామన్న చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత ఆయన సొంత సంపద సృష్టికే ప్రాధాన్యతనిస్తున్నారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణం, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేట్ పరం, మూడు లక్షల మంది ఉద్యోగులను నిరుద్యోగులుగా మార్చి ఆ పోస్టులను దొడ్డిదారిలో అమ్ముకోవడం, ఇసుక అక్రమాలు, మద్యం ప్రైవేట్ పరం చేయడం ద్వారా తనకు, తన బంధువులు, కార్యకర్తలు, నాయకులు, అనుచరులకు సంపద కట్టబెట్టేలా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతి నిర్మాణం ఆ ప్రాంతంలో చేపట్టడం సరైంది కాదని ప్రపంచ బ్యాంకు మొత్తుకున్నా సీఎం చంద్రబాబు వినడం లేదన్నారు. అమరావతి మునిగినా.. తేలినా తనకేం పట్టదన్న ధోరణితో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి వ్యక్తిగత సంపద సృష్టించుకోవాలని ఆరాట పడుతున్నారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేద విద్యార్థులు సైతం వైద్య విద్యనభ్యసించాలనే లక్ష్యంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూతన వైద్య కళాశాలలను తీసుకువస్తే.. ఆ కళాశాలలను చంద్రబాబు పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ కింద ఏర్పాటు చేసి తద్వారా అక్రమార్జనకు రంగం సిద్ధం చేశారన్నారు. లక్షలాది మంది వలంటీర్లు, మద్యం షాపులో పని చేసే 15వేల మంది, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోని 4 వేల మంది కార్మికులను తొలగించి రోడ్డున పడేశారన్నారు. గత ప్రభుత్వంలో మద్యం తక్కువగా అమ్ముడుపోయేలా షాపులను కుదించడంతో పాటు మద్యం విక్రయాల ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 4వేల మద్యం షాపులకు అనుమతులు జారీ చేస్తూ సిండికేట్ ద్వారా భారీగా లబ్ధిపొందేందుకు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో 21.50 లక్షల మందికి ఇళ్లను మంజూరు చేశామన్నారు. 30 లక్షల మందికి భూములు కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలను ఇచ్చినట్లు గుర్తు చేశారు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలపై విధించిన భారాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుదించిందన్నారు. జగన్ ప్రభుత్వంలో నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లలో 10 లక్షల గృహాలు పూర్తయ్యాయని, 11 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో అధికారం చేపట్టిన చంద్రబాబు... వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు చేసిన ఇళ్లు పీఎంఏవై-2.0 పరిధిలోకి రావని, అంతేకాక ప్రభుత్వం మంజూరు చేస్తామన్న రూ.4 లక్షలు వారికి వర్తించదని చెబుతున్నారన్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ముందుకురాని పరిస్థితి నెలకొందన్నారు. సహజ వనరులను కొల్లగొట్టడంతో పాటు పేదల సంక్షేమానికి తెరదించి, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న చంద్రబాబు అరాచక పాలనపై న్యాయపోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతల దౌర్జన్యాల నుంచి పార్టీ కార్యకర్తలను, నాయకులను, సానుభూతిపరులను కాపాడుకునేందుకు రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి ఇద్దరు న్యాయవాదులను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. సమస్య వచ్చిన వెంటనే న్యాయవాదులను కలసి పరిష్కారం పొందాలన్నారు. ఇందుకు సంబంధించి పార్టీ మండల, పంచాయతీ కన్వీనర్లను సంప్రదించి సెల్ నంబర్లు ఇవ్వాలని కోరారు.

ప్రాణం పోయమంటే... పేగులు గడ్డనేశారు!

- సర్వజనాస్పత్రిలో సర్జరీ వైద్యుల నిర్లక్ష్యం
- ఆపరేషన్ చేసి వార్డుకు తరలించిన రోజే బయటపడిన పేగులు
- నెపం రోగిపై నెట్టి చేతులెత్తేసిన వైద్యులు
- ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వృద్ధుడు


ప్రాణాపాయస్థితిలో ఎస్ఐసీయూలో చికిత్స పొందుతున్న వృద్ధుడు


హనుమప్ప కడుపులో నుంచి బయటకు వచ్చిన పేగులు

అనంతపురం మెడికల్: జీవి పుట్టుకకు దేవుడు కారణమైతే... ఆ జీవి ఆయురారోగ్యాలతో పరిపూర్ణ జీవితం గడిపేందుకు వైద్యులు కారణమై దేవుడితో సమానంగా ఖ్యాతి దక్కించుకున్నారు. అయితే కొందరు వైద్యుల కారణంగా ఈ ఖ్యాతి కాస్త అపఖ్యాతిగా మారుతోంది. ఇందుకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో సర్జరీ విభాగం సేవలే నిదర్శనం. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరుకున్న ఓ వృద్ధుడికి శస్త్రచికిత్స చేసి వార్డుకు తరలిస్తే పేగులు బయటపడ్డాయి. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా...

కణేకల్లు మండలం బెన్నికల్‌కు చెందిన వృద్ధుడు హనుమప్ప కడుపునొప్పితో బాధపడుతుంటే కుటుంబసభ్యులు ఆ చుట్టుపక్కల ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు గత నెల సర్వజనాస్పత్రికి పిలుచుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు గత నెల 25న యూనిట్ 2 లో అడ్మిట్ చేసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటర్ స్టైనల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా కడుపు నొప్పి వస్తోందని గుర్తించి లాపరోటమీ సర్జరీ (పొత్తికడుపు ఓపెన్ సర్జరీ) చేసి ఎస్ఐసీయూకు తరలించారు. ఐసీయూకు తరలించిన అదే రోజు హనుమప్పకు సర్జరీ వైద్యులు వేసిన కుట్లు తెరుచుకుని కడుపులో నుంచి పేగులు బయటపడ్డాయి. దీంతో కుటుంబీకులు, పక్కనే ఉన్న రోగులు, వారి సహాయకులు భయభ్రాంతులకు గురయ్యారు. వార్డులోని సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడి విషయాన్ని వెంటనే వైద్యులు దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికే అనస్తీసియా నుంచి బయటపడిన హనుమప్ప నొప్పి భరించలేక కేకలు వేస్తుండడంతో ఎస్ఐసీయూలో భయానక వాతావరణం నెలకొంది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న వైద్యులు వెంటనే తమ తప్పును సరిదిద్దుకునే చర్యలు చేపట్టారు. ఇదేమిటని బాధిత కుటుంబసభ్యులు వైద్యులను ఆరా తీస్తే హనుమప్ప కదలడం, ఆయాసం అధికంగా కావడంతో పేగులు బయటపడ్డాయని నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతేకాక ఈ అంశం వెలుగు చూడకుండా తొక్కిపెట్టారు. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో హనుమప్ప కొట్టుమిట్టాడుతున్నట్లు సమాచారం. కాగా, యూనిట్ 2 వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శస్త్రచికిత్స విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. సర్జరీ విభాగంలో సరైన ప్రమాణాలను వైద్యులు పాటించడం లేదని ఆస్పత్రి వర్గాలే బాహాటంగా చెబుతున్నాయి. సీనియర్లు చేయాల్సిన సర్జరీని పీజీ వైద్య విద్యార్థులతో చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. సర్వజనాస్పత్రిలో సర్జరీ విభాగం వైఫల్యాలపై ఆస్పత్రి పాలక వర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఆటో నుంచి జారి పడి చిన్నారి మృతి

హిందూపురం అర్బన్: ఆటో నుంచి జారి పడి ఓ చిన్నారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బోయ సురేష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆయన భార్య లేపాక్షి మండలంలోని పులమతిలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో ఆమెను పిలుచుకొచ్చేందుకు తన ఐదేళ్ల వయసున్న కుమారుడు చిన్నాతో కలసి సొంత ఆటోలో శుక్రవారం ఉదయం పులమతి గ్రామానికి బయలుదేరాడు. హిందూపురం పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపైకి చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా పరుగెత్తుకు వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో చిన్నా అదుపు తప్పి ఆటో నుంచి జారి కిందపడ్డాడు. తీవ్రమైన గాయం కావడంతో అదే ఆటోలో హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై హిందూపురం పట్టణ పోలీసులు ఆరా తీస్తున్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- రైలు పట్టాలపై మృతదేహం


సి.నిఖిత్ (ఫైల్)

రొళ్ల: ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు... రొళ్ల మండలం హనుమంతనపల్లికి చెందిన చంద్రప్ప రెండో కుమారుడు సి.నిఖిత్ (18) హిందూపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో గురువారం మధ్యాహ్నం కళాశాలలో అవుట్‌పాస్ తీసుకుని బయటికి వచ్చాడు. సాయంత్రం హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై మృతదేహమై కనిపించాడు. అటుగా వెళ్లిన కొందరు గమనించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విద్యార్థి గుర్తింపు కార్డులోని ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతుడిని నిఖిత్‌గా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, నిఖిత్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.